నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుషాయిగూడ: చర్లపల్లి సబ్‌స్టేషన్–1 పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ బాబురావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వైటల్ థెరప్యూటీస్ ఫీడర్ పరిధిలోని బీఎన్‌రెడ్డినగర్, ఫేస్–1 పార్టులో ఉదయం 11 గంటల నుంచి 11.30 వరకు ఫేస్–4 ఫీడర్ పరిధిలోని బీఎన్‌రెడ్డినగర్, ఫేస్–1 పార్టు ప్రాంతాల్లో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఐకామ్ ఫీడర్ పరిధిలోని ఫేస్–1 ఏరియాలో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ఒంటి గంట వరకు కరెంట్ ఉండదన్నారు.

మల్లాపూర్: 33/11 కేవీ నాచారం సబ్‌స్టేషన్ పరిధిలోని ముల్తీ స్టీల్, వాయిత్ టర్బో ఫీడర్ పరిధిలో విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఐడీఏ నాచారం రోడ్డు నెంబర్ 7,8, వాయిత్ టర్బో ఇండ్రస్టీస్ ఏరియాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు ప్రకటించారు.

పార్టీ బలోపేతానికి కృషి



నియామకపత్రాలను అందజేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎస్సీసెల్ ఉప్పల్ చైర్మన్ రామకృష్ణ ఆధ్వర్యంలో నియామకపత్రాలను పరమేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. నాచారం డివిజన్ ఎస్సీసెల్ అధ్యక్షుడిగా బొల్లం నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏర్పుల సుజాత, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కార్యనిర్వాహక కార్యదర్శి బాలరాజ్‌లు నియామక ఉత్తర్వులను అందుకున్నారు.

బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా హరినాయక్



కుషాయిగూడ: బీజేపీ మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా కుషాయిగూడకు చెందిన బీజేపీ సీనియర్ నేత ఇస్లావత్ హరినాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా హరినాయక్ మాట్లాడుతూ.. తనపై విశ్వాసంతో జిల్లా పార్టీ కౌన్సిల్ సభ్యుడిగా అవకాశం కల్పించిన పార్టీ నాయకులకు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నాలాపై రూ.94 లక్షలతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను త్వరగతిన పూర్తి చేయాలని నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ అధికారులకు సూచించారు. శనివారం నాలా డైవర్షన్ పనులను కాప్రా ఈఈ నాగేందర్‌తో కలిసి పర్యవేక్షించారు. బీఆర్ఎస్ నేతలు కట్ట బుచ్చన్నగౌడ్, భూపాల్‌రెడ్డి, ఎర్ర శ్రీనివాస్ రెడ్డి, దాసరి కర్ణ, మాక్బుల్, హరిప్రసాద్ తదితరులున్నారు.

అన్నదానం

గౌతంనగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ మల్కాజిగిరి అధ్యక్షుడు లయన్ అశోక్‌కుమార్, లయన్ సుజాతల ఆధ్వర్యంలో శనివారం ఎంఎస్.రెడ్డి లయన్ కంటి ఆసుపత్రిలో పేషెంట్లకు అన్నదానం చేశారు. ముఖ్య అతిథులుగా లయన్ కృష్ణప్రసాద్, లయన్ శేఖర్‌రెడ్డిలు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. లయన్స్ క్లబ్ సభ్యులు చంద్రమోహన్, హన్మంతరావు, మార్కెట్ చైర్‌పర్సన్ లక్ష్మీమూర్తి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

అల్వాల్: ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హస్మత్‌పేట అంజయ్యనగర్‌లో నివసించే తూముల సంతోష్ (21) బోయినపల్లి మార్కెట్‌లో క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 17న మార్కెట్‌కి వెళ్లి రాత్రి ఇంటికొచ్చిన అతడు గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. కుటుంబసభ్యులు ఎంత పిలిచినా తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు బాది లోపలికి వెళ్లి చూడగా గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెట్టింగ్ యాప్‌లో రుణాలు తీసుకునేవాడని, గతంలో తీసుకున్న వాటికి రూ.2 లక్షలకు పైగా చెల్లించామని తండ్రి రాజయ్య వాపోయాడు. వేధింపుల వల్లే తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని ఆయన పోలీసులకు వివరించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రేడ్ లైసెన్స్ చెల్లింపులెలా ?

- వ్యాపారులకు నెలాఖరు వరకు గడువు
- విముఖత వ్యక్తం చేస్తున్న వ్యాపారులు
- జరిమానా విధిస్తామని అధికారుల హెచ్చరిక

మల్కాజిగిరి: వ్యాపారం చిన్నదైనా, పెద్దదైనా ట్రేడ్ లైసెన్స్ తప్పకుండా ఉండాలని, ప్రతి ఏటా లైసెన్స్ రెన్యూవల్ చేసుకోకపోతే జరిమానా చెల్లించాల్సి ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

భారీగా వసూలు చేస్తున్నారు..

గతంలో లైసెన్స్ రెన్యూవల్ సులువుగా ఉండేదని ప్రస్తుతం దాన్ని కేవలం పన్నుల వసూళ్ల కోసం కఠినతరం చేయడమే కాకుండా భారీగా జరిమానా విధిస్తున్నారని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెల్లించాలంటేనే బెంబేలు..

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ రుసుము చెల్లించాలంటే వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. సర్కిల్ పరిధిలో సుమారు వివిధ రకాల వ్యాపార సముదాయాలున్నాయి. వారిలో ట్రేడ్ లైసెన్స్ తీసుకుని వ్యాపారాలు నిర్వహించేవారు 6341 మంది ఉన్నారు. వీటిలో సుమారు 1999 రద్దు చేసుకోవడం లేదా డబుల్ ఎంట్రీలు కూడా ఉన్నాయి.

విధానం మార్చడం కూడా ఓ కారణం...

గతంలో ప్రతి ఏటా ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలలో లైసెన్స్ ఫీజు చెల్లించేవారు. ప్రస్తుతం ఈ విధానానికి మార్పులు చేసి ముందస్తుగా వసూలు చేస్తున్నారు. దీనిపై వ్యాపారులకు అవగాహన కల్పించకపోవడంతో చెల్లింపులు చేయలేకపోతున్నారు.



మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయం

భారీ జరిమానా విధిస్తామని హెచ్చరికలు..

ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహించేవారికి 100 శాతం అపరాధ రుసుము విధిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. లైసెన్స్ తీసుకునేంత వరకు నెలకు 10 శాతం అపరాధ రుసుము అదనంగా విధిస్తామన్నారు. ఇప్పటికే ట్రేడ్ లైసెన్స్ ఉన్న వారు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 31వ తేదీ వరకు గడువు ఉందని, గడువు దాటిన తర్వాత మార్చి వరకు 25 శాతం, ఏప్రిల్ నుండి 50 శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రూ.6 కోట్లకు రూ.45 లక్షలే..

ఈ ఏడాది రూ.6 కోట్ల డిమాండ్ ఉండగా.. ఇప్పటి వరకు కేవలం రూ.45 లక్షలే వసూలయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో గ్రీన్‌టాక్స్ ప్రతి దుకాణానికి రూ. 1000 గా ప్రభుత్వం నిర్ణయించింది. చెల్లించాల్సిన లైసెన్సు ఫీజు కంటే ఎక్కువ మొత్తంలో గ్రీన్‌టాక్స్ ఉండటంతో చాలామంది వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ రుసుము చెల్లించడం లేదు. దీంతో లెక్కల్లో జరిమానాను పెంచుకుంటూ పోవడంతో చెల్లించాల్సిన మొత్తం భారీగా పెరిగింది.

సిబ్బంది కొరత..

ట్రేడ్ లైసెన్స్ వసూళ్లు సర్కిల్ పరిధిలోని శానిటేషన్ విభాగం పర్యవేక్షిస్తుంది. అందులో సిబ్బంది తక్కువగా ఉండటం వారికివ ఇతర పనులు అప్పగించడంతో లైసెన్స్ వసూళ్లు మందగిస్తున్నాయి. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సర్వేక్షణ్‌తో పాటు పలు కార్యక్రమాలు ఉండటంతో ఏఎమ్‌హెచ్‌ఓతో పాటు ఇద్దరు శానిటరీ సూపర్‌వైజర్లకు ఆ పనులే సరిపోతున్నాయి.

లైసెన్సులు లేకుండానే..

ప్రతి ఏటా గడువు ఉన్నప్పుడే వసూళ్లపై శానిటేషన్ అధికారులు దృష్టి సారిస్తున్నారు. తగినంత అధికారులు, సిబ్బంది లేకపోవడంతో ఏడాది పొడువునా దుకాణాలను తనిఖీ చేసి లైసెన్స్ లేని వాళ్లను గుర్తించి వారికి లైసెన్సులు జారీచేసేలా చూడటం లేదు. కొంతమంది అధికారులు, సిబ్బందికి సంబంధిత దుకాణదారులతో ఉన్న సాన్నిహిత్యమే కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.

◆ సర్కిల్ పరిధిలో లైసెన్స్ లేకుండా వెలుస్తున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, దుకాణాలు, కర్రీ పాయింట్లు వెలుస్తున్నాయి. వాటిపై నిఘా లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ముందుగానే చెల్లించాలి..

వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ ముందుగానే రెన్యూవల్ చేసుకోవాలి. ఇప్పటికే లైసెన్స్ తీసుకున్న వారి మొబైల్స్‌కు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారంతో పాటు చెల్లించడానికి లింక్ కూడా వచ్చి ఉంటుంది. సర్కిల్ కార్యాలయం కౌంటర్, ఆన్‌లైన్, జీహెచ్ఎంసీ యాప్ లేదా మీసేవలో కూడా చెల్లించవచ్చు. లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహించడం చట్ట ప్రకారం నేరం, తప్పకుండా జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.
– డాక్టర్ మంజుల, ఏఎమ్‌హెచ్ఓ

పెండింగ్ పనులను పూర్తి చేస్తాం



ప్రగతినగర్‌లో పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ శ్రీవాణి



ఐఐసీటీ డైరెక్టర్‌తో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని ప్రగతినగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన ఉద్యానవనాన్ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని అన్ని కాలనీలు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, శ్మశానవాటికల్లో ఉద్యాన వనాలను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రూ.40 లక్షలతో చేపట్టే వరదనీటి కాలువ పనులను ప్రారంభించారు. రామంతాపూర్ డివిజన్ పరిధిలో ఇప్పటికే 80 శాతం అభివృద్ధి పనులు పూర్తి చేశామని, పెండింగ్ పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. జీహెచ్ఎంసీ హార్టికల్చర్ అధికారి నర్సింగరావు, ప్రగతినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి, కోశాధికారి మురళీధర్, సంయుక్త కార్యదర్శి ప్రవీణ్, ప్రధాన సలహాదారు వెంకట్‌రెడ్డి వెంకటేశ్వరరావు, రాజగోపాల్, శ్రీకాంత్, ప్రభాకర్, గంధం నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: హబ్సిగూడ–నాచారం మార్గంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఐఐసీటీ డైరెక్టర్‌ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిశారు. ఐఐసీటీ ఇనిస్టిట్యూట్, క్వార్టర్స్ ప్రహరీ వల్ల రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని శనివారం డైరెక్టర్‌ను కలిసి వివరించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు రోడ్డు విస్తరణకు సంబంధిత అధికారుల నుంచి అనుమతులు వచ్చేలా చూడాలని కోరారు. దీనిపై డైరెక్టర్ సానుకూలంగా స్పందించనట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు సాయిజెన్‌శేఖర్, గంధం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ సర్వే నెంబర్ 43, 44,45లోని ఎన్ఎఫ్‌సీ కంపెనీ ప్రహరీకి ఆనుకుని ఉన్న టీఎస్ఐఐసీఈకి చెందిన ఖాళీ స్థలంలో స్థానికులకు ఉపయోగపడేలా కమ్యూనిటీహాల్, పార్కును అభివృద్ధి చేయాలని శనివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ ఈటలకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బండారి

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



గంగాధర్ (ఫైల్)

మల్లాపూర్: కారు డోర్ తగిలి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతి చెందిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ గోకుల్‌నగర్‌కు చెందిన గజం గంగాధర్ (65) ఇంటి నుంచి స్కూటీపై మౌలాలి హౌజింగ్ బోర్డుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సూర్యనగర్ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో పార్క్ చేసిన స్విఫ్ట్ కారు డోరు తీస్తుండగా వెనకాల నుంచి వచ్చిన అతడు ఢీ కొట్టాడు. దీంతో తలకు తీవ్రగాయం కాగా.. క్షతగాత్రుడిని సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం అతడు మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధి 8వ డివిజన్‌లో శనివారం మేయర్ అమర్‌సింగ్ పర్యటించారు. శనివారం మౌలిక వసతుల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, డీఈ సాయినాథ్‌గౌడ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

సన్మానం



మౌలాలి: బీజేపీ మౌలాలి డివిజన్ అధ్యక్షుడిగా ఎన్నికైన శివగౌడ్ మల్కాజిగిరి ఎంపీకి ఈటల రాజేందర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఆయనను ఎంపీ సన్మానించారు. లింగారావు, ప్రసాద్, మురళి, ఫణీంద్రశర్మ, యోగేందర్, శ్రీకాంత్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

కాప్రా: సాకేత్ ఫేజ్–2లో నెలకొన్న సమస్యలను సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తానని కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి హామీ ఇచ్చారు. శనివారం ఫేజ్–2 ఎక్స్‌టెన్షన్‌లో పర్యటించిన సందర్భంగా కాలనీవాసులు స్థానిక సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తాగునీరు, సీసీరోడ్ల సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించి వినతిపత్రం అందజేశారు. కాలనీవాసుల సమస్యలు తెలుసుకుని త్వరలోనే పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

‘ఆర్ఆర్ఆర్’ను విజయవంతం చేయండి



పుస్తకాలు సేకరిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఎమ్‌హెచ్ఓ డాక్టర్ మంజుల, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చింత శ్రీనివాస్, నాగరాజు పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలోని 6 డివిజన్లలో శానిటేషన్ సిబ్బందితో కాలనీ అసోసియేషన్ల సహకారంతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. ఇంట్లో వినియోగంలో లేని దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, పాతపుస్తకాలు, ఆటవస్తువులు, పాత సైకిళ్లు ఇతర వస్తువులను సిబ్బంది చేత సేకరించామన్నారు. ప్రజల వద్ద నుంచి విశేష స్పందన రావడంతోనే ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ఎస్ఎఫ్‌ఏలు గిరి, వెంకటేష్, శేఖరయ్య, ఎల్లయ్య, వసంత తదితరులున్నారు.

జైళ్లశాఖ పనితీరు ప్రశంసనీయం

కుషాయిగూడ: తెలంగాణ జైళ్లశాఖ పనితీరు ప్రశంసనీయమని తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యుడు, సెక్రటరీ సీహెచ్. పంచాక్షరి, మేడ్చల్ జిల్లా సెక్రటరీ కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం చర్లపల్లి కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జైల్‌లో ఖైదీల సంక్షేమం, వసతులపై జైల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జైల్‌లో ఖైదీల బ్యారక్‌లు, సంజీవని, కిచెన్‌లతో పాటు జైలు పరిశ్రమలు, నర్సరీ, ఖైదీల ఉత్పత్తులను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. న్యాయ సహాయానికి అవసరమైన ఖైదీలకు ఉచిత న్యాయ సాయం అందజేస్తామన్నారు. జైల్ పర్యవేక్షణాధికారి రామచంద్రం, ఉపపర్యవేక్షణాధికారి కాళిదాసు, శశికాంత్, రత్నం తదితరులు పాల్గొన్నారు.



జైలులో కిచెన్‌ను పరిశీలిస్తున్న లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రతినిధులు

పోకిరీలకు అడ్డాగా ప్రధాన రహదారి !



రోడ్డు పక్కనే విక్రయిస్తున్న నిర్మాణ సామగ్రి



కాలనీకి వెళ్లేమార్గంలో ఫుట్‌పాత్‌పై పాన్‌డబ్బా

- జెడ్‌టీసీ క్రాస్‌రోడ్స్ నుంచి ఫుట్‌పాత్ ఆక్రమణలు
- రాత్రిపూట ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఫిర్యాదు చేసిన పట్టించుకోని వైనం

మల్కాజిగిరి: మౌలాలి ‘జోనల్ ట్రైనింగ్ సెంటర్’ (జెడ్‌టీసీ) క్రాస్‌రోడ్స్ నుంచి హౌసింగ్ బోర్డుకు వెళ్లే ప్రధాన రహదారి పోకిరీలకు అడ్డాగా మారుతోంది. జవహర్‌నగర్, ఏపీఐఐసీ కాలనీ, వేంకటేశ్వరనగర్ తదితర కాలనీలకు వెళ్లడానికి కాలనీవాసులు రాత్రిపూట వెళ్లాలంటేనే భయపడుతున్నారు.

పాన్ డబ్బాల వద్ద అడ్డా..

క్రాస్‌రోడ్డులోనే అయాన్ డిజిటల్ జోన్ ఆన్‌లైన్ పరీక్షా కేంద్రం ఉంది. వారంలో మూడు రోజులైనా ఏదో ఒక పరీక్ష జరుగుతుంది. వందల్లో మహిళలు పరీక్షలు రాసేందుకు వస్తుంటారు. వెంకటేశ్వరనగర్ ఎంట్రెన్స్ వద్ద ఫుట్‌పాత్‌లపై కొందరు పాన్‌డబ్బాలు ఏర్పాటు చేసుకున్నారు. వీరి వద్దకు వచ్చే పోకిరీలు వాహనాలను రోడ్డుపై పార్క్ చేయడమే కాకుండా ఇష్టానుసారంగా సిగరెట్లు తాగుతూ.. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

నిర్మాణ సామగ్రి విక్రయాలు..

మరో రెండు రహదారుల వద్ద వెల్డింగ్ దుకాణం, మరోచోట ఇంటి నిర్మాణ సామగ్రిని ఫుట్‌పాత్‌పై పోసి విక్రయిస్తున్నారు. జెడ్‌టీసీ నుంచి వేంకటేశ్వరనగర్ దాటిన తర్వాతనే యూటర్నింగ్ ఉంది. తరచూ ఇంటి నిర్మాణ సామగ్రి అమ్మే ప్రాంతంలో వాహనాలు యూటర్నింగ్ చేసుకునే వారు ఇబ్బంది పడుతున్నారు.

ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం..

ఈ విషయంపై పలుమార్లు మల్కాజిగిరి సర్కిల్ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోకపోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలి..

పోలీసులకు 100కు డయల్ చేసి ఫిర్యాదు చేసినప్పుడు వస్తున్నారని, ఒకటి రెండ్రోజులు బాగానే ఉన్నా.. తిరిగి అదే పరిస్థితి ఉందని, పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు

మల్లాపూర్: నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం రేషన్‌కార్డులు అందించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా రేషన్‌కార్డు దరఖాస్తుల కార్యక్రమాన్ని శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డు లభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నాయకులు నెమలి రవి, తండా వాసుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ధర్మరాజు, శ్రీనివాస్‌రెడ్డి, ఉస్మాన్, పరమేష్‌రెడ్డి, గణేష్, శ్రీశైలం తదితరులున్నారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

గదిలో నుంచి దుర్వాసన రావడంతో గుర్తింపు

కుషాయిగూడ: అనుమానాస్పదస్థితిలో ఓ వివాహిత మృతి చెందిన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్, అన్నవరానికి చెందిన మృతురాలి కుటుంబం చాలా ఏళ్ల క్రితం నగరానికి వచ్చి కూలీ పనిచేసుకుంటూ.. కాప్రా, గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నారు. వారి కుమార్తె స్నేహ (22) ప్రైవేటు ఆఫీసుల్లో పనిచేసేది. ఈ క్రమంలో కాచిగూడ, రాజమౌలాకు చెందిన సచిన్ సత్యనారాయణను 2022లో ప్రేమ వివాహం చేసుకుంది. అప్పటి నుంచి ఇరు కుటుంబాలకు వారు దూరంగానే ఉంటున్నారు. డిసెంబరు 11న కుషాయిగూడ పోలీస్‌స్టేషన్, నాగార్జుననగర్ కాలనీ రోడ్డు నెంబరు–5లోని భాస్కరాచారి ఇంట్లో అద్దెకు దిగి మొదటి అంతస్తులో నివాసం ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం వారు ఉంటున్న గదిలో నుంచి దుర్వాసన వస్తుండటంతో ఇంటి యజమాని వెళ్లి చూడగా స్నేహ మృతిచెంది ఉంది. ఆయన పోలీసులకు సమాచారం అందించగా.. కుళ్లిన స్థితిలో మృతదేహం పడి ఉంది. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ బృందాల సాయంతో పోలీసులు ఆధారాలు సేకరించారు. మృతురాలి భర్త కనిపించకపోవడంతో అతడిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భోగి పండుగ నుంచి కనిపించడంలేదని. అదే రోజున చనిపోయి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. కాగా మృతురాలు 7 నెలల గర్భవతి. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ జైళ్ల శాఖ టెండర్లకు ఆహ్వానం

కుషాయిగూడ: జైళ్లలో ఆహార వస్తువుల సరఫరా కోసం తెలంగాణ జైళ్లశాఖ టెండర్లను ఆహ్వానిస్తోంది. చర్లపల్లి కేంద్ర కారాగారం, ఖైదీల వ్యవసాయక్షేత్రం, చర్లపల్లి ప్రత్యేక మహిళ కారాగారంలో ఆహార వస్తువులు, ఫ్యాక్టరీ సెక్షన్ కోసం కావాల్సిన ముడి సరుకుల సరఫరా నిమిత్తం టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు చర్లపల్లి జైలు పర్యవేక్షణాధికారి రామచంద్రం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెండర్ల ఫారాలు ఈనెల 28న సాయంత్రం 5 గంటల వరకు చర్లపల్లి జైల్ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయన్నారు. ఇతర వివరాలకు 9494632101, 9494632113, 9490549502, 9848394001, 9866922657.

సహచరులే హతమార్చి..

- జార్ఖండ్ యువకుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- 9 మంది నిందితుల రిమాండ్

కుషాయిగూడ: సంక్రాతి పండుగ రోజు దారుణహత్యకు గురైన జార్ఖండ్ యువకుడు బాబుషల్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. బెదిరింపులు, వేధింపులు తాళలేక సహచరులంతా కలిసి హత్య చేశారు. ఈ ఘటనలో 9 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హత్యకు సంబంధించిన వివరాలను శనివారం చర్లపల్లి ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వివరించారు. జార్ఖండ్‌కు చెందిన బాబుషల్ తుడు (35) చర్లపల్లి పారిశ్రామికవాడలోని ఓ ప్లాస్టిక్ ఇండస్ట్రీలో పనిచేసుకుంటూ అక్కడే ఉండేవాడు. భార్యతో విడాకులు తీసుకున్న అతడు తల్లి కూడా చనిపోవడంతో ఒంటరిగానే ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై తరచుగా సహచర స్నేహితులపై బెదిరింపులకు పాల్పడేవాడు. జార్ఖండ్, దుమ్కా జిల్లాకు చెందిన లూకీరాం తుడు (27) రాసిలాల్ సొరెన్ (28) అభిలాష్ బస్కీ (33) ఉత్తమ్ హన్సాదా (22) కోసల్‌ందర్ సోరెన్ (26) సికిందర్ మరాండీ (24) సికిందర్ ముర్మూ (18) సందీప్ ముర్మూ (26) గులాబ్ ముర్మూ (27)లు వేరే ప్లాస్టిక్ కంపెనీలో పని చేస్తూ అక్కడే ఉంటున్నారు. సెలవు రోజుల్లో జార్ఖండ్‌కు చెందిన వారంతా కలిసి పార్టీలు చేసుకోవడం, మద్యం తాగడం చేస్తుంటారు. వీరితో పాటుగా బాబుషల్ తుడు కూడా కలిసేవాడని పోలీసులు తెలిపారు. చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేస్–4 లోని ఓ ఖాళీ ప్రదేశానికి వెళ్లి అందరూ కలిసి మద్యం సేవించారు. మద్యం మత్తులో జరిగిన గొడవ కాస్తా మాట మాట పెరిగి హత్యకు దారి తీసిందన్నారు. కేసును ఛేదించిన చర్లపల్లి పోలీసులను సీపీ సుధీర్‌బాబు, డీసీపీ పద్మజ, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ మహేష్‌కుమార్‌లు అభినందించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాట్య స్కూల్ ఆఫ్ కూచిపూడి కుమారి లహరి బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గణేశా, పంచరత్న, మూషికవాహన, బృందావన సారంగీ, తిల్లాన తదితర అంశాలను లహరి ప్రియా, ఇషిక, కీర్తన, మంగళం, మహాలక్ష్మి తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

రూ.55 లక్షలతో అభివృద్ధి పనులు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో రూ.55 లక్షలతో అభివృద్ధి పనులకు శనివారం కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్ శంకుస్థాపన చేశారు. డివిజన్ పరిధిలోని మైనార్టీ, కురుమ, రెడ్డి సంఘాల శ్మశానవాటికలను వైకుంఠ దామాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని అన్ని శ్మశానవాటికలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. జీహెచ్ఎంసీ అధికారులు వెన్నల గౌడ్, ఏఈ వనీత్‌రావు, బీఆర్ఎస్ నేతలు జగన్, కొండల్‌రెడ్డి, జగన్, శ్రీనివాస్, అశోక్‌చారి, సుందర్ పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ గీత